

ఎస్‌పిగా దామోదర్

వకుల్ జిందల్‌కు గుంటూరు బదిలీ

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం జిల్లా నూతన ఎస్‌పిగా ఎ.ఆర్.దామోదర్ నియమితులయ్యారు. ఇక్కడ ఎస్‌పిగా ఉన్న వకుల్‌జిందల్‌ను గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా రానున్న ఎస్‌పి దామోదర్ నాన్ కేడర్ ఎస్‌పిగా 2019 ఫిబ్రవరి నుంచి జూన్ వరకు మన జిల్లాలో విధులు నిర్వహించారు. ఎన్నికల అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జూన్‌లో బదిలీ అయ్యారు.

ఎస్‌పి దామోదర్

విజ్ఞాన సంబరం.. ఆరంభం

మహాసభలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్

జెవివి జెండా ఆవిష్కరిస్తున్న సింహాద్రినాయుడు; వందనం చేస్తున్న నాయకులు

ఓవైపు విజ్ఞాన ప్రసంగాలు... మరోవైపు వైజ్ఞానిక ప్రదర్శనలు.... ఇంకోవైపు శాస్త్రీయ ఆలోచనలు.... అభ్యుదయ గీతాలాపనలు.. పుస్తక ప్రదర్శనలు. వీటన్నింటి మేళవింపే శనివారం జరిగిన జెవివి రాష్ట్ర మహాసభ. విజయనగరంలోని గురజాడ అప్పారావు ప్రాంగణం (జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణం)లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభలు శనివారం అంత్యంత ఉత్సాహ పూరితంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర నలు మూలల నుంచి సుమారు 400మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో వైద్యులు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో రంగాలకు చెందిన నిపుణులు, మేధావులు ఉన్నారు. వీరంతా సైన్స్ ప్రజలందరికీ అందుబాటులోకి రావాలని, ప్రజల కోసం, ప్రగతికోసం, దేశ స్వాలంభన కోసం దీన్ని ఉపయోగించాలని ముక్తకంఠంతో నినదించారు. ఇందుకు ఆటంకంగావున్న శక్తులను ఎదుర్కోవాలని సభకు హాజరైన వక్తలు పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శన, అభ్యుదయ కళలు, సాహితీవేత్తల ఫోటో ఎగ్జిబిషన్ ఎంతో ఆలోచింపజేశాయి. వర్షిత అతిథులు, హాజరైన సభికులతో జెడ్‌పి ప్రాంగణం కళకళ లాడింది. పండగ వాతావరణంలో ప్రారంభమైన ఈ మహా సభలో ఎంతో మంది ప్రముఖులు ప్రసంగించారు. గురజాడ స్వగృహాన్ని పరిరక్షించాలని, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని, గురజాడ పుట్టిన జన్మదినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఆయన పేరున సాంస్కృతిక రాజధాని ఏర్పాటు చేయాలని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఘనంగా జెవివి రాష్ట్ర మహాసభ ప్రారంభం

సందడిగా గురజాడ అప్పారావు ప్రాంగణం

ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన, కళా బృందాల గీతాలాపన

ఉత్తేజ పర్చిన మేధావుల ప్రసంగాలు

ప్రజాశక్తి - విజయనగరంటౌన్, కంటోన్మెంట్

ముందుగా మహాసభల ప్రారంభ సూచికగా జాతీయ జెండాను ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, జెవివి జెండాను ఆ సంస్థ సీనియర్ నాయకులు నారు సింహాద్రి నాయుడు ఆవిష్కరించారు. అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమరవీరుల చిత్రపటాల వద్ద మాజీ ఎమ్మెల్సీలు, జన విజ్ఞాన వేదిక నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం జయంతి నార్త్ ఎండ్ వేదికపై జరిగిన ప్రతినిధుల సభ జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన జరిగింది. ముందుగా అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ ఆయన మాట్లాడుతూ కవులు, కళాకారులు, విజ్ఞాన భాండాగారంగా ఉన్న విద్యల నగరమైన విజయనగరంలో రాష్ట్ర మహాసభలు ఆనందంగా ఉందన్నారు. గురజాడ లాంటి దేశభక్తులు నడయాడిన నేల మీద మహాసభలు జరగడం స్ఫూర్తి దాయకమన్నారు. అనంతరం ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివి రమణ మాట్లాడుతూ వాడుక భాష ఉద్యమానికి నాంది పలికిన గిడుగు ఇక్కడ వారే, సంగీత ద్వారాలను తెరిచిన ద్వారం వెంకటస్వామి, కోడి రామమూర్తి, శ్రీరంగం నారాయణ బాబు, ఆంట్యాకుల పైడిరాజు వంటి వారు పుట్టిన నేల అన్నారు. ప్రగతి శీల భావాలు కలిగిన ఈ ప్రాంతం ఉత్తరాంధ్ర కాదు ఉత్తమాంధ్ర అంటూ కొనియాడారు. నేటి సమాజంలో జెవివి అవసరం ఎంతో ఉందన్నారు. శాస్త్రీయ ఫలాలు ప్రజలకు అందాల్సిన అవసరం ఉందన్నారు. మెరుగైన సమాజం కోసం శాస్త్రీయ దక్పథం పెంపొందే లక్ష్యంగా పని చేయాలన్నారు. ● మహాసభలో ప్రధాన వక్త మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ ఓవైపు శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ, అదే స్థాయిలో మూఢ నమ్మకాలు, విశ్వాసాలు పెరిగి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల కోసం, శాంతికోసం, దేశ స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదంతో జన విజ్ఞాన వేదిక శక్తివంతంగా పనిచేయడం అభినందనీయమన్నారు. ఆరోగ్యం, పర్యావరణ పరి రక్షణ, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం, మూఢ నమ్మకాలతో నష్టపోయే ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం జెవివిపై ఉందన్నారు. ● ముఖ్యఅతిథి ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ జనరల్ సెక్రెటరీ ఆషామిశ్రా మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ సమయంలోనే ప్రజాసైన్స్ ఉద్యమానికి బీజాలు పడ్డాయని, మేఘనాథ్ సాహా, బిసి రాయ్ వంటి శాస్త్రవేత్తలు సైన్స్ సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేశారని వివరించారు. ● విద్యావేత్త, మాజీ ఎమ్మెల్యే కెఎస్ లక్ష్మణరావు రాష్ట్ర సమగ్రాభివృద్ధి అనే అంశంపై ప్రసంగించారు.

మహాసభలో మాట్లాడుతున్న గేయానంద్, విఠపు బాలసుబ్రహ్మణ్యం

ఆధునిక సమాజం కోసం కృషి చేయాలి

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ 19వ శతాబ్దంలో గురజాడ చెప్పిన ఆధునికత ఏ విధంగా ఉందో దాని కోసం పని చేయాల్సిన కర్తవ్యం ఏమిటో మహాసభలో నిర్ణయాలు చేయాలన్నారు. గురజాడ ఉంటే గౌరీలంకేష్ ఘటన జరిగే అవకాశం ఉండేది కాదేమో అన్నారు. ఆధునిక సమాజం గురించి ప్రజలకు చెప్పాల్సిన అవసరం మనపై ఉందన్నారు. ఎందుకని భారత్‌లో పారిశ్రామిక విప్లవం రాలేదో, ఎందుకని వెనుకబడి పోయిందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలో పేరుగాంచిన టాప్ 100 యూనివర్సిటీలో ఒక్కటి కూడా దేశంలో లేదన్నారు. జెవివి గురజాడ అప్పారావు సాక్షిగా మెరుగైన సమాజం కోసం పని చేస్తుందన్నారు. ఆధునిక దేశంగా మారాలంటే, సమానత్వం, అభివృద్ధి జరగాలంటే ఆధునిక సమాజం కావాలన్న గురజాడ సాక్షిగా మరో 40 ఏళ్లపాటు ఆధునిక సమాజం కోసం కష్టి చేసేలా మహాసభలో చర్చ జరగాలన్నారు. ●ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ దేశం నాలెడ్జ్ హబ్‌గా ఉందని, అక్షరాస్యత ఎంతో పెరిగిందని, అయినా ఎందుకు వెనుకబాటులో ఉన్నామో అనేది ప్రజలను చైతన్యం చేయాల్సి ఉందన్నారు. దేశంలో యువతను సక్రమంగా వినియోగించుకుంటే దేశాభివృద్ధి సాధ్యం అన్నారు. రాజ్యాంగం మానవత విలువలు, సైంటిఫిక్ టెంపర్మెంట్ ఉండాలని చెప్పిందన్నారు. అదే మార్గంలో జెవివి నడుస్తుందని అన్నారు. అక్షరాస్యత పెరగాలని, అదే సమయంలో ఆర్థిక సమానత్వం ఉండాలని అన్నారు. మన సమాజానికి జెవివి లాంటి సంస్థల అవసరం ఎంతయినా ఉందన్నారు. అందరిలోనూ ప్రశ్నించే గుణం పెరగాలన్నారు. ఆరోగ్య కరమైన సమాజం కోసం జెవివి మరింత కృషి చేయాలని కోరారు. ● మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ అజ్ఞానంలో ఉన్న ప్రజలను జ్ఞానం వైపు నడిపించడానికి జెవివి ఎంతో కృషి చేస్తోందన్నారు.

ఇసుకతో జెవివి 18వ మహాసభ సైకత శిల్పం

సైన్స్ ఉద్యమానికి ఎల్లలు అవసరం లేదు

సైన్సు ఉద్యమానికి ఎల్లలు అవసరం లేదని జెవివి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాజేశ్వరరావు అన్నారు. దేశంలో శాస్త్రీయతను పెంపొందించే సైన్సునుప్రచారం చేసే 40పైగా సంస్థలు ఉన్నాయని అందులో జనవిజ్ఞాని వేదిక ఒకటని. అందులో ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో ఉంటుందని అన్నారు.

సోషల్ మీడియాలో జన విజ్ఞానంపై అనేక దాడులు జరుగుతున్నాయని వాటిని మనం తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. 12 లక్షల మంది విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక శతభిక టాలెంట్ పేరుతో దగ్గరయ్యిందన్నారు.

గురజాడ గృహాన్ని పరిరక్షించుకోవాలి

గురజాడ వారసురాలు ఇందిర మాట్లాడుతూ గురజాడ గృహాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 1980లో గురజాడ గృహాన్ని కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి అందించారని, 2015లో పురావస్తు శాఖ ఆధీనంలోకి తీసుకుందని తెలిపారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన గురజాడ సాహిత్యాన్ని కాపాడుకోవాలన్నారు. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని నమ్మిన వ్యక్తి గురజాడ అని, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన అవసరాన్ని అప్పుడే పసిగట్టారని అన్నారు. గురజాడ గృహాన్ని పరిరక్షించుకొని కొన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. ● ప్రముఖ కథారచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ సమాజాన్ని అజ్ఞానం వైపు నడపడానికి రాజకీయ నాయకులు ముందుంటారని విమర్శించారు. గాంధీ పుట్టిన నేలలో గాడ్సే నాయకులు దేశాన్ని నేడు పాలిస్తున్నారని అన్నారు. సనాతనాన్ని మోసిన వారు, మతం రాజ్యమేలేలా చేస్తున్నారని అన్నారు. అందరం కలసికట్టుగా పనిచేసి అజ్ఞానాన్ని మూఢత్వాలను తొలగించాలని పిలుపునిచ్చారు.

● విజయనగరం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ పిల్లలనుంచి పెద్దల వరకు జెవివి విజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. జనవిజ్ఞాన వేదికలో సమతా టీం మహిళల కోసం ప్రత్యేకంగా పనిచేస్తుందని కొనియాడారు. మూఢనమ్మకాలను, సైన్సును ప్రజల్లోకి తీసుకు వెళ్లడం అభినందనీయమన్నారు. ● సభలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.విజయగౌరి సావిత్రిబాయ్ పూలే మీద రాసిన పుస్తకాన్ని, జెవివి పల్నాడు జిల్లా అధ్యక్షులు రాసిన మానవుడే మహనీయుడు, కాకినాడ జెవివి నాయకులు రాసిన పుస్తకాలను ఆవిష్కరించారు. ● జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు ఆహ్వానం పలికిన ఈ మహాసభలో జనసేన నాయకులు ఎం.సురేష్, జెవివి నాయకులు చీకటి దివాకర్, తదితరులు ప్రసంగించారు. జెవివి నాయకులు వి.రాజగోపాల్, రమణ ప్రభాత్, కె.శివానంద్ కుమార్, సమతా కన్వీనర్ జి.నిర్మల తదితర నాయకులు పాల్గొన్నారు.

గీతాలాపన చేస్తున్న కళాకారులు

వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేసిన విద్యార్థులు

హాజరైన ప్రతినిధులు

సంతకవిటిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కొరత.. తీరని వెత

సంతకవిటిలో రైతుల పడిగాపులు ● రాజాంలో రహదారిపై బైఠాయింపు, ఉద్రిక్తత

ప్రజాశక్తి- సంతకవిటి / రాజాం

సంతకవిటి మండల కేంద్రంలోని యూరియా కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. శనివారం సంతకవిటిలోని మన గ్రోమోర్ దుకాణం వద్ద రైతులు భారీగా లైన్‌లో బురదలోని నిలబడి యూరియా దొరకకపోవడంతో నిరాశతో ఇంటి ముఖం పట్టారు. దుకాణం వద్ద రైతులు తోపులాట జరగటంతో స్థానిక ఎస్ఐ ఆర్.గోపాలరావు సమక్షంలో ఎఒ సి.బి.యశ్వంత్ రావు ఎరువులను పంపిణీ చేశారు. 15 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు రైతులకు తెలియడంతో తెల్లవారు నుంచే పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. వచ్చిన యూరియా తక్కువవడం, రైతులు ఎక్కువవడంతో చాలా మంది రైతులకు ఎరువులు దొరకలేదు. దీంతో నిరాశతో వెనుదిరిగారు.

రాజాం పట్టణంలోని శనివారం రైతులు యూరియా కోసం శ్రీకాకుళం వెళ్లే ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. రాజాంలోని మన గ్రోమోర్ ప్రైవేట్ దుకాణం వద్ద రైతులు ఉదయం నుండి బారులు తీరారు. రోజుల తరబడి వేచి చూస్తున్నా యూరియా దొరకకపోవడంతో రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం యూరియా ఇప్పించండి అంటూ నినాదాలు చేసి, డిమాండ్ చేశారు. ఈ మేరకు పలువురు రైతులు యూరియా ఇవ్వకపోతే విషం తాగి చస్తామంటూ కన్నీళ్లు పెట్టికున్నారు. రైతులు ముందుగా డబ్బులు చెల్లించినా గత మూడు రోజులగా టోకెన్లు ఇచ్చి పంపిస్తున్నారని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకపక్క యూరియా కొరత లేదని ప్రభుత్వం చెబుతున్న సకాలంలో రైతులకు యూరియా అందడంలేదని బహిరంగంగానే రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు.

రాజాంలో రహదారిపై బైఠాయించిన రైతులు

రోడ్డుపై నిలిచిన వాహనాలు

పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డులో రైతులు ఆందోళన చేయడంతో కిలోమీటరు మేర ట్రాఫిక్ స్తంభించింది. భారీగా వాహనాలు బారులు తీరాయి. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని, రైతులతో మాట్లాడి ఆందోళన విరమింప చేశారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కలిసికట్టుగా కృషి

కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంప్రతినిధి

జిల్లా సమగ్రాభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అన్నారు. జిల్లా నుంచి వలసలను నివారించి, ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యంగా జిల్లా ఏయే రంగాల్లో వెనుకబడి ఉందో పరిశీలించి, ఆయా రంగాల అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ గా ఆయన శనివారం బాధ్యతలను స్వీకరించారు. కలెక్టర్‌కు ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు, కలెక్టరేట్ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యక్రమాలను ముందుకు నడిపిస్తామని చెప్పారు. జిల్లా అభివద్ధి విషయంలో ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారని, వారి ఆదేశాల మేరకు ముందుకు వెళ్తామని అన్నారు. ప్రాజెక్టులు, పరిశ్రమలకు భూసేకరణను వేగవంతం చేస్తామన్నారు. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే, దానికి అనుబంధంగా పలు పరిశ్రమలు ఏర్పాటవుతాయని తెలిపారు. ఎగుమతులకు ఎంతో అవకాశం కలుగుతుందన్నారు. ముఖ్యంగా జిల్లాలో పర్యాటక రంగ పరిశ్రమ అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిపై దృష్టి పెడతామని చెప్పారు. జిల్లా అధికారులు, మండల అధికారులను కలుపుకొని జిల్లాను ముందుకు నడిపిస్తామని కలెక్టర్ చెప్పారు.

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

జెఎన్‌టియుజివికి ఫార్మసీ కళాశాల మంజూరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం గురజాడ విజయనగరంలో ఫార్మసీ కళాశాలను ప్రారంభించటానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతులు మంజూరు చేసిందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ తెలిపారు. అక్టోబర్ నుంచి ఫార్మసీ కళాశాల ప్రారంభం అవుతుందని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా కొన్ని సర్టిఫికేషన్ కోర్సులు, ఫార్మసీ కోర్సులు ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ (3 నెలలు కాలపరిమితి), ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్ అండ్ టూల్స్(1నెల వ్యవధి), మెషిన్ లెర్నింగ్ (1నెల), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (1నెల), సైబర్ సెక్యూరిటీ (1 నెల), ఉంటాయని, అర్హులైన వారు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నారు. పూర్తి వివరాలు కోసం 7780351078ను సంప్రదించాలని తెలిపారు.

5వేల క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మడ్డువలస ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి శనివారం 5వేల క్యూసెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచిపెట్టామని ఎఇ కె.నితిన్‌కుమార్ తెలిపారు. కుడి ఎడమ కాలువలు ద్వారా మరో 660 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు విడిచిపెడుతామన్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలు కారణంగా సువర్ణముఖి, వేగావతి నదులు నుండి 3353 క్యూ సెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి లెవెల్ నీటిమట్టం 65 మీటర్లు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 64.45 మీటర్ల లెవెల్ నీటిమట్టం ఉందని వెల్లడించారు.

రెండు గేట్ల ద్వారా దిగువకు విడిచిపెడుతున్న నీరు

లెప్రసీ వ్యాధిని ముందుగా గుర్తించాలి

డిఎంహెచ్ఒ జీవనరాణి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

లెప్రసీ వ్యాధిని ముందస్తుగా గుర్తించాలని డిఎంహెచ్ఒ ఎస్.జీవనరాణి కోరారు. శనివారం జిల్లాలోని యుపిహెచ్‌సిల వైద్యాధికారులకు, స్టాఫ్‌నర్సులకు డిఎంహెచ్ఒ కార్యాలయంలో కుష్టు వ్యాధి పట్ల శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ లెప్రసీపై ప్రజలలో అవగాహన కల్పించి వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించాలని కోరారు. ఈ వ్యాధిపట్ల సమాజంలో వివక్ష లేకుండా చూడాలని కోరారు. మొదటగా జిల్లా లెప్రసీ, టిబి నివారణ అధికారి డాక్టర్ కె.రాణి, స్టాప్ నర్సులకు లెప్రసీ నిర్మూలన పట్ల అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ అర్చనదేవి, డిఎన్ఎంఒ వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పిఎంఒ, డిపిఎంఒ, డిఎస్ఒ పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల పోరాటం ఉధృతం

ఎమ్మెల్సీ రఘురాజు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ నిర్వాసితుల పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. జిందాల్ నిర్వాసితులు ఢిల్లీలో ఆందోళనలు నిర్వహించి తిరిగొచ్చారు. శనివారం మండలంలోని బొడ్డవరలో నిరసన శిబిరం వద్ద సమావేశమై, భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితుల గొంతు గల్లీ నుంచి ఢిల్లీ వరకు విజయవంతంగా వినిపించామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే జిందాల్ యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరించిన కలెక్టర్ బదిలీ కూడా అయ్యారని చెప్పారు. త్వరలో వెయ్యి మంది నిర్వాసితులతో చలో అమరావతి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అప్పటికీ నిర్వాసితులకు న్యాయం జరగకపోతే జిఒ నంబర్ 14కు వ్యతిరేకంగా ఇటు జిందాల్ నిర్వాసితులతోనూ, అటు తాటిపూడి ఆయకట్టు రైతులతోనూ సదస్సు నిర్వహిస్తామని వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు మొత్తం.. జిందాల్ నిర్వాసితులను నియంతృత్వంగా అణగదొక్కే చర్యలే చేపట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. కానీ ఢిల్లీ పోలీసులు అత్యంత ప్రజాస్వామ్య పద్ధతులతో అనుమతులు ఇవ్వడమే కాకుండా చివరి వరకు నిర్వాసితులకు మద్దతుగా నిలిచారన్నారు. నిర్వాసితుల భూమి తిరిగి వారికిచ్చి మళ్లీ భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, నిర్వాసితులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు భూముల పందేరం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని ప్రభుత్వ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం తహతహలాడిపోతోందా? అంటే జిల్లా వాసుల నుంచి అవుననే సమాధానం వినిపిస్తోంది. ఏ మూలకు వెళ్లినా భూసేకరణే. కంపెనీలు, రహదారి సదుపాయాలు వంటి పేర్లతో వీటిని సేకరిస్తున్నా వాటివల్ల కార్పొరేట్ శక్తులకే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని జనం చర్చించుకుంటున్నారు. ఇంతకీ ఈ చర్చ ఎందుకంటారా..? ఐటి పార్కుల పేరుతో భోగాపురం జాతీయ రహదారికి ఆనుకుని 5 వేల ఎకరాల మేర సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఆదేశాలు అందడమే తడువుగా రెవెన్యూ యంత్రాంగం ఆ పనిలో నిమగ్నమైంది. వాస్తవానికి ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు పేరుతో గతంలోనే 2,700 ఎకరాలను సేకరించారు. ఇందులో 2,200 ఎకరాల్లో మాత్రమే ఎయిర్‌పోర్టు నిర్వహణ, కార్యకలాపాలు ఉన్నాయి. మిగిలిన 500 ఎకరాలు రిజర్వులో ఉన్నాయి. దీన్ని ఉపయోగించకుండానే ఐటి పార్కుల పేరుతో 5 వేల ఎకరాల సేకరణ అంటే ఎంత మంది రైతులు తమ భూములను కోల్పోవాల్సి ఉంటుందో వేరేగా చెప్పనక్కర్లేదు. ఇదికూడా జాతీయ రహదారికి 15 కిలోమీటర్ల వ్యవధిలోనే ఉండాలని, ఒక్కో బ్లాకులో కనీసం 100 ఎకరాలు ఉండాలనే షరతు కూడా అధికార యంత్రాంగానికి విధించారు. ఇంకా ఐటి కంపెనీలు రాకుండానే పెద్దఎత్తున భూములు లాక్కొనేందుకు సిద్ధపడటం చూస్తుంటే కార్పొరేట్ ప్రయోజనాలే కనిపిస్తున్నాయని జనం మాట్లాడుకుంటున్నారు. అల్యూమినియం శుద్ధి కర్మాగారం పేరిట 20ఏళ్ల క్రితం శృంగవరపుకోట మండలం బొడ్డవరలో 1100 ఎకరాల భూమి సేకరించిన సంగతి తెలిసిందే. నష్టపరిహారం చెల్లించడంతోపాటు కంపెనీ పెట్టాక అందులో షేర్లు, ఉద్యోగాలు ఇస్తామని జిందాల్ సంస్థ అప్పట్లో నమ్మబలికింది. వాస్తవానికి ఐదేళ్లలోపు పరిశ్రమలు పెట్టకపోతే భూమి వెనక్కి తీసుకుని, రైతులు లేదా సంబంధిత భూమి యజమానులకు ఇప్పించాలి. ప్రభుత్వం ఆ పని చేయలేదు సరికదా, ఎంఎస్‌ఎంఇ పార్కు పేరుతో సంబంధిత సంస్థకు భూమి మొత్తం కట్టబెట్టింది. ఈ విషయంలో మోసపోయిన రైతులు గగ్గోలు పెట్టినప్పటికీ, ప్రభుత్వానికి వినిపించలేదు. పూసపాటిరేగ మండలం కోనాడ సముద్రతీర ప్రాంతంలో ఉప్పు భూములను కూడా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కొద్దికాలం క్రితమే పావులు కదిపింది. వేపాడ మండలం 213.80 ఎకరాల మారిక కొండను పవర్ ప్లాంట్ ఏర్పాటు పేరిట గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ అనే అదానీ సంస్థకు కట్టబెట్టేందుకు మూడు నెలల క్రితమే నోటిఫికేషన్ జారీచేసింది. అక్కడి గిరిజనుల జీవనోపాధిని సైతం ప్రభుత్వం లెక్కచేయలేదు. పర్యాటక అభివృద్ధి పేరిట తాటిపూడి వద్ద రూ.10.63 ఎకరాల విలువైన స్థలాన్ని ప్రైవేటు గుత్తపెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైపోయింది. భోగాపురం మండలంలోని ముంజేరులో కూడా 3.50 ఎకరాల స్థలం ప్రయివేటు స్టార్ హోటల్ నిర్మాణానికి కేటాయించారు. ఇలా చెప్పుకుంటూ పోతే పరిశ్రమల ఏర్పాటు పేరుతో వేల ఎకరాల భూములను ప్రయివేటు పెట్టుబడిదారుల కోసం కేటాయించారు, చేస్తున్నారు. తాజాగా ఐటి పార్కుల పేరిట 5వేల ఎకరాల సేకరణకు సిద్ధపడుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జిల్లాలోని వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో విశాలమైన స్థలాలు ఉన్నాయి. విజయనగరం నడిబొడ్డున విటి అగ్రహారం, పక్కనే ఉన్న సారిపల్లి పారిశ్రామిక వాడల్లోనూ లేఅవుట్లు ఖాళీగానే ఉన్నాయి. ఇవి చాలవన్నట్టు నియోజకవర్గానికో ఎంఎస్‌ఎంఇ పార్కు అంటూ 280 ఎకరాలు కేటాయించారు. మరోవైపు ఉన్న పరిశ్రమలు మూతపడినా పట్టించుకోలేదు. జనం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోవడంతో వలసబాట పట్టారు. ఈ నేపథ్యంలో ఉన్న భూములను ఉపయోగించుకోకుండా అదనపు భూములు సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధపడుతుండటంతో జనంలో అసహనం వ్యక్తమౌతోంది.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుందర్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ అధికారులు

గాలికుంటు వ్యాధిని నిరోధించండి : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో గాలికుంటు వ్యాధిని నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి ఆదేశించారు. ఈనెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు నిర్వహించే గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను తమ చాంబర్లో శనివారం కలెక్టర్ ఆవిష్కరించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా నెలరోజులపాటు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పశువులకు వేయడం ద్వారా, ఈ వ్యాధిని జిల్లాలో పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఇన్చార్జ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దామోదర్ రావు, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

తహాశీల్దార్‌గా రామారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-వంగర

మండల తహాశీల్దారుగా పిన్నింటి రామారావు (స్వామి) శనివారం బాధ్యతలు చేపట్టారు. రాజాం తాహాశీల్దారుగా పనిచేస్తున్న రాజశేఖర్ ఇంతవరకు వంగర ఇంచార్జ్ తాహాశీల్దారుగా బాధ్యతలు చూడడంతో ఆ స్థానంలో వంగర, రేగిడి మండలాలకు సిఎస్‌డిటిగా పనిచేస్తున్న పిన్నింటి రామారావును నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

17 నుంచి విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి -చీపురుపల్లి

ఈ నెల 17 నుంచి చీపురుపల్లి పట్టణంలోని హడ్కో కాలనీలో శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షులు మారోజు చక్రధర్, ప్రధాన కార్యదర్శి పట్నాన ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు సర్వసిద్ధి భాస్కరరావు, స్వర్ణకార సంఘ జిల్లా ఉపాధ్యక్షులు కొచ్చర్ల రామకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ప్రాంగణంలో మహోత్సవాలకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని మండల విశ్వబ్రాహ్మణ సంఘం తరపున పిలుపునిచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు టి.సత్యనారాయణ, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని సతివాడ ఉదాంతంలో కేసు నమోదైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని జైభీంరావు భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం వారు గ్రామాన్ని సందర్శించి మాట్లాడారు. గణపతి నిమజ్జనంలో బిసి, దళితులకు జరిగిన వివాదంలో బిసిలు 36 మందిపై ఎస్‌సిలు కేసు పెట్టి వారం రోజులు గడుస్తున్నా ఇంత వరకూ వారిని అరెస్ట్ చేయకపోవడం అన్యాయమన్నారు. దళితులను సామాజిక బహిష్కరణ చేసినట్లు ఆరోపించారు. కేసు నమోదైన వారు బహిరంగంగా తిరుగుతున్నారని వారిని చూసి దళితులు భయపడు తున్నారని తెలిపారు. వారిని అరెస్టు చేసి దళితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఇండియా మిషన్ నాయకులు బి. అప్పలరాజు, ఎ.మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



మరియమాత ఆలయాన్ని దర్శించుకుంటున్న ప్రజలు

కోడూరు యాత్రకు తరలివచ్చిన జనం

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని కోడూరులో శనివారం జరిగిన మరియమాత యాత్రకు జనం తరలివచ్చారు. జిల్లాతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా జనం తరలిరావడంతో ఆ ప్రాంతం జనసంద్రమైంది. ఏటా సెప్టెంబరు రెండో శనివారం కోడూరులో మరియమాత యాత్రను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఫాదర్ పి.యంగ్ కుమార్ ఆధ్వర్యంలో పండగ నిర్వహించారు. ఏటా మాదిరిగానే ఈసారి జనం భారీగా తరలివచ్చి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రైతులకు పంటలు బాగా పండాలని ప్రార్థించారు. ప్రతి వ్యక్తి భక్తి భావం కలిగి ఉండాలని, అప్పుడే శాంతి సమాజం లభిస్తుందని విశాఖపట్నం పీఠాధిపతుల ఉదుముల బాల అన్నారు. బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి ఆధ్వర్యంలో రూరల్ సిఐ నారాయణరావు, ఎస్‌ఐలు తారకేశ్వరరావు, జయంతి, సాగర్‌బాబు, ప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.

పెట్రోల్ బంకులో తనిఖీలు

డెంకాడ(భోగాపురం): భోగాపురం మండల కేంద్రంలోని భారత్ పెట్రోలియం బంక్‌లో విక్రయిస్తున్న పెట్రోల్లో నీళ్లు కలిశాయని కొంత మంది ఫిర్యాదు చేయడంతో అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి ఎస్.అన్నెన, తహశీల్దార్ రమణమ్మ, సివిల్‌డి మధిరి సంయుక్తంగా పెట్రోల్ బంక్‌లో స్టోరేజ్ ట్యాంకులు, సరఫరా విధానంపై విచారణ చేపట్టారు. అనంతరం వినియోగదారులు ఇచ్చిన వాంగ్మూలాన్ని జెసికి అందజేస్తామన్నారు. బంకు పరిధిలో వినియోగదారులతో అసభ్యకరంగా మాట్లాడడం మౌలిక వసతులు కల్పించకపోవడంపై వచ్చే ఫిర్యాదులపై యాజమాన్యానికి హెచ్చరికలు జారీ చేశారు. ఇటువంటి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీతంలో ముగిసిన పైథాన్ వర్క్‌షాప్

విజయనగరంలోటౌన్: స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 8 నుంచి నిర్వహించిన కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్ విద్యార్థులకు పూర్తి స్టాక్ పైథాన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. విద్యార్థులంతా పోటీ కోడింగ్ కాంపిటీషన్ లో పాల్గొనేవిధంగా ఆసక్తి పెంపొందించారు. కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మూర్తి, డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాప్‌లను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

వేపాడ : మండలంలోని డబ్బిరాజుపేట గ్రామంలో శనివారం వరలక్ష్మి ఫౌండేషన్ సహకారంతో జనసేన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. రోగులకు వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందజేశారు.

గంట్యాడలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గంట్యాడ

మండల కేంద్రమైన గంట్యాడ గ్రామంలో శనివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 160 మందికి నేత్ర పరీక్షలు చేశారు. 50 మంది శస్త్రచికిత్సలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో క్యాంప్ మేనేజర్ బి.నాగరాజు, పి.మౌనిక, పి.పావని, ఐఆర్‌డిఎస్ ప్రతినిధి సి.హెచ్.చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

లోక్ అదాలత్‌లో 6852 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 6852 కేసులు పరిష్కారమయ్యాయి. కేసులను సామరస్య పూర్వకంగా, స్నేహ పూరిత వాతావరణంలో ఎటువంటి వివాదాలు లేకుండా పరిష్కరించే ఏకైక మార్గం లోక్ అదాలత్ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత తెలిపారు. విజయనగరంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటాయన్నారు. విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, శృంగవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస, కురుపాం కోర్టుల్లో 6852 కేసులను పరిష్కరించారు. అందులో సివిల్ కేసులు 280, క్రిమినల్ కేసులు 6505, ప్రీ లిటిగేషన్ కేసులు 67 పరిష్కరించారు. లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి చెందిన రూ.37.50 లక్షలను మోటార్ ప్రమాద బీమా కేసులో పిటిషనర్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అందజేశారు. లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు ప్రముఖ న్యాయవాది కుమారస్వామి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.మీనాదేవి, కె.విజయ కళ్యాణి, బి.అప్పలస్వామి, ఎన్.పద్మావతి, కె.నాగమణి, ఎ.కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

శృంగవరపుకోట : న్యాయ సేవాధికార సంస్థ మండల చైర్‌పర్సన్ బి.కనకలక్ష్మి అధ్యక్షతన కోర్టులో లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఇందులో 337 కేసులను పరిష్కరించారు. వీటిలో క్రిమినల్ కేసులు 324, సివిల్ కేసులు 2, చెక్ బౌన్స్ కేసులు 9, మనోవర్తి కేసులు 2 ఉన్నాయి. న్యాయమూర్తి అప్పలనాయుడు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, పలు న్యూసెన్స్ కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షులు జి.సూరిదేముడు, కార్యదర్శి బివిఎస్ రామారావు, ఎపిపి రమణమ్మ, ప్రభుత్వ సహాయ న్యాయవాది టివిఆర్ మూర్తి, ట్రెజరర్ బి.త్రిమూర్తులు, మీడియా సెక్రటరీ డబ్ల్యుఎస్ శర్మ, లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

గజపతినగరం : గజపతినగరం కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా న్యాయమూర్తి ఎ.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో 585 కేసులు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

బొబ్బిలి : స్థానిక కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మికుమారి, జూనియర్ సివిల్ జడ్జి హేమస్రవంతి జానకిరామ్ ఆధ్వర్యంలో రెండు బెంచులు ఏర్పాటు చేసి లోక్ అదాలత్ నిర్వహించారు. పెండింగ్ కేసులు 56, ప్రీలిటిగేషన్ కేసుల ఒకటి, బ్యాంక్ బకాయి కేసులు 5, క్రిమినల్ కేసులు 88 రాజీ చేశారు.

వసతి గృహానికి ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని రింగ్ రోడ్డు సమీపంలో గల వెనుక బడిన బాలుర వసతి గృహానికి మేమున్నాం స్వచ్ఛంద సేవా సంఘం సభ్యులు ఫ్యాన్లు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ సభ్యులు పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులకు మంచి వసతులు, వాతావరణం కల్పించినట్లయితే ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వసతి గృహ సంరక్షకులు బాలు, మేరీ, సంస్థ సభ్యులు డోకి చంద్రశేఖర్, సూరిబాబు,కంది. మూర్తి పాల్గొన్నారు

వరలక్ష్మి పాఠశాలలో హిందీ దివస్ వేడుకలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

డాక్టర్ వరలక్ష్మి పాఠశాలలో హిందీ దివస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వై.జానకిదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎపి ఎన్‌జిఒ సంఘాన్ని క్షేత్రస్థాయిలో పటిష్టం చేయాలి

రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఎపి ఎన్‌జిఒ సంఘాన్ని క్షేత్ర స్థాయిలో పటిష్టం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు విద్యా సాగర్ కోరారు. శనివారం ఎన్‌జిఒ హోం జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తాలూకా యూనిట్ స్థాయిలో ఉన్న అద్యక్ష కార్యదర్శులు ప్రతి ఉద్యోగి ని కలిసి మెంబర్ షిప్ చేయించి ఎన్నికలు జరుపుకొని వ్యవస్తాగతంగా క్షేత్ర స్థాయిలో సంఘాన్ని పటిష్టం చేయాలన్నారు. ఉద్యోగుల పిఆర్‌సి, డిఎ ఇతర పెండింగ్ డిమాండ్ల ప్రభుత్వము తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాకు కొత్త వర్గాన్ని ఏర్పాటు చేసుకోవడానికి అడహక్ కమిటీ ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు . అనంతరం ఇటీవల ఆగస్టు 31 న పదవీ విరమణ చేసిన బి.హెచ్ ఎస్ ఆర్ ప్రభూజీని సత్కరించారు. ఈ సందర్భంగా గౌరవ రాష్ట్ర అధ్యక్షులు మాటాడుతూ సంఘం లో ఒక నిబద్ధత తో విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. గల అన్ని తాలూకా యూనిట్ లు అద్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్ష కారదర్శులు టి శ్రీధర్ బాబు, ఎ.సురేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ జివిఆర్ఎస్ కిషోర్, పట్టణ అధ్యక్షులు వై.ఆనంద కుమార్ రాష్ట్ర మహిళ విభాగం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యేకు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నియోజకవర్గంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు స్థానిక ఎమ్మెల్యే అతిధి విజయలక్ష్మి గజపతిరాజుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, జీవో నంబర్ 77 ను రద్దు చేసి ప్రైవేటు పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని, మెస్‌ఛార్జి రూ.3వేలకు పెంచాలని, ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి సొంత భవనం ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జి.సూరిబాబు , కె రాజు, శివ, గుణ, శ్రీను, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కలెక్టర్ అంబేద్కర్‌కు పౌర సంఘాల సన్మానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా నుంచి బదిలీ అయిన కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు శనివారం పౌర సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి చిట్టిబాబు ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గా బిఆర్ అంబేద్కర్ బాధ్యతలు స్వీకరించిన నాటినుండే గాడి తప్పిన అధికారులు దారిలో పెట్టడం, శాఖల వారీగా లోపాలను సరిదిద్దే ప్రయత్నం చేయడం, కలెక్టర్ గా తనకున్న అధికారాలను వినియోగించి పేద సాధలను ఆదుకొని, తారతమ్యం లేకుండా ప్రజల పక్షాన నిలిచే కలెక్టర్ గా గుర్తింపు పొందారని కొనియాడారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్ట ప్రకారం 25శాతం సీట్లు పేదలకు అందేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ క్యాంపెయిన్ ఆన్ దళిత్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు ఉదరపల్లి రాము, డిబిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సియాదుల పార్వతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. పి.రాజు, డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ కె.వరలక్ష్మి, జి. రామలక్ష్మి, జై భీమ్ రావు భారత పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు నర్సయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు

ఆటో కార్మికులకు రూ.25 వేలు ఇవ్వాలి

కార్మిక సంఘాల నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - చీపురుపల్లి

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కారణంగా రోడ్డున పడ్డ ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం రూ.25వేలు మంజూరు చేసి ఆదుకోవాలని పలు యూనియన్ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 17న రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆటోలు, టాటా మ్యాజిక్‌ల బంద్ విజయవంతం చేయాలని కార్మిక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో శనివారం చీపురుపల్లిలోని ఆటో స్టాండ్ వద్ద ఆటో కార్మికులతో నిరసన ర్యాలీ చేశారు. ఉచిత బస్సు సౌకర్యం కారణంగా రోడ్డును పడ్డ ఆటో, టాటా మ్యాజిక్ క్యాబ్ డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 21, ఈ చలానాల రద్దు, ఆర్‌టిఒ వేధింపులు, ప్రైవేట్ ఫిట్నెస్ సెంటర్ల రద్దు తదితర అంశాల పైన జిల్లా వ్యాప్తంగా ఈ నెల 17న ఆటో కార్మికుల ధర్నాకు పిలిపునిచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఏ గౌరనాయుడు, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు ఎన్ అప్పలరాజు రెడ్డి, కార్యదర్శి రెడ్డి నారాయణరావు, గరివిడి చీపురుపల్లి ఆటో సంఘ అధ్యక్షులు మాడుగుల రమణ, రాజాం స్టాండు నాయకులు రామకృష్ణ, మండల రమణ, చీపురుపల్లి, గరివిడి, మెరకముడుదాం, రాజాం, లావేరు స్టాండ్ ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం శనివారం మినిస్టీరియల్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా జిల్లానూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రమేష్, తవిటిందొర, కోశాధికారిగా మేకల సత్యనారాయణ ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ముచ్వల అమర్ నాథ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో చంద్రబాబునాయుడు జీవో 3స్థానం లో ప్రత్యామ్నాయం జీవో తీసుకొస్తామని హామీ ఇచ్చారు కానీ ప్రత్యామ్నాయం చూపకుండానే మెగా డీఎస్సీ 2025 లో ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పోస్టులను కలపడం వలన ఆదివాసీ నిరుద్యోగ యువతి యువకులు తీవ్రంగా నష్ట పోయారని అన్నారు. కావున మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ ప్రాంతంలో పోస్ట్ లను మినహాయించి ఎస్టీ ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలన్నారు. మన్యం జిల్లా అధ్యక్షులు జన్ని పైడిరాజు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు షరతులు లేకుండా ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. కార్యవర్గంలో సహాధ్యక్షులుగా మండంగి కిశోర్‌కుమార్, సహాయ కార్యదర్శిగా ఎస్.దారరాజు, గౌరవాధ్యక్షులుగా కొండగొర్రె చెల్లయ్య, జిల్లా కార్యదర్శులుగా కె.అచ్చుతరావు, రొంగలి ఈశ్వరరావు, ఆర్.సింహాచలం, యు.గంగారావు తదితరులు ఉన్నారు.

హమ్మయ్య.. కంప్యూటర్లు బాగు చేశారు..

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి సచివాలయంలో కంప్యూటర్లు, ప్రింటర్ మొరాయించాయని ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి సర్పంచ్ బుడుమూరు పట్టాభి, కార్యదర్శి పోలినాయుడు స్పందించి మరమ్మతులు చేపట్టారు. కంప్యూటర్లు, ప్రింటర్ బాగు చేయడంతో ప్రభుత్వ సేవలు పూర్తిస్థాయిలో అందడంతో హమ్మయ్య బాగు చేశారని ఐదు గ్రామాల విద్యార్థులు, ప్రజలు, అర్జీదారులు ఆనందం వ్యక్తం చేశారు. డిజిటల్ అసిస్టెంట్, సోషల్ వెల్ఫేర్, వ్యవసాయ అసిస్టెంట్ ఇతర శాఖల ఉద్యోగులు తమ పనులు సులువుగా జరుగుతున్నాయని వెల్లడించారు.

సతివాడలో సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలం లోని సతివాడలో శనివారం స్థానిక ఎస్ఐ బి.గణేష్ ఆధ్వర్యంలో ఆరు సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర నియంత్రణ, ఇటీవల కాలంలో తలెత్తిన శాంతిభద్రతల అంశాలను దృష్టిలో పెట్టుకొని గ్రామంలో ప్రధాని కూడళ్ళు, మోడల్ స్కూల్ దగ్గర రెండు కెమెరాలు, ఎస్‌సి కాలనీ అంబేద్కర్ విగ్రహం దగ్గర రెండు కెమెరాలు, రామ మందిరం వద్ద మరొక రెండు కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కెమెరాలు ఏర్పాటుతో గ్రామాల్లో దొంగతనాలు నివారణ, శాంతి భద్రతల పరిరక్షణకు దోహదపడతాయన్నారు. మిగిలిన గ్రామాల్లో పెద్దలు, యువత ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ బి.గణేష్

నేడు గజపతినగరంలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - గజపతినగరం

సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గంగరాజు థియేటర్ ఎదురుగా ఉన్న నేత్రాలయ ఐ కేర్ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి రేవంత్ ఒక ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సహకారంతో శిబిరంలో కంటి పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. దృష్టి సమస్య ఉన్న వారికి శస్త్రచికిత్స కూడా ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకు రావాలని కోరారు.

జనసేన విస్తృత స్థాయి సమావేశం

డెంకాడ : భోగాపురం మండలంలోని ముంజేరు పార్టీ కార్యాలయంలో శనివారం జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆధ్వర్యంలో రాబోయే స్థానిక ఎన్నికల వ్యూహం పై నాయకులు, కార్యకర్తలతో సమగ్రంగా చర్చించారు. పార్టీ బలోపేతానికి ప్రతి స్థాయిలో కృషి చేయాలని, గ్రామ స్థాయిలో జనసేన శక్తిని మరింత పెంచాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

పూసపాటిరేగ : కనిమెల్ల గ్రామంలోని గుడిలో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను శనివారం కామవరం జంక్షన్ వద్ద అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. కోనాడ, పేరాపురం గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుండి కాపర్ వైర్, గుడిలో చోరీ చేసిన సొత్తు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

పోర్టు సిటీ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పోర్టుసిటీ పాఠశాలలో దాట్ల ఆసుపత్రి ఆధ్వర్యాన శనివారం ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. డాక్టర్ శ్రీను (జనరల్ ఫిజిసియన్), డాక్టర్ శైలజ (గైన కాలిజిస్ట్) ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మొత్తం 200 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల చైర్మన్ కె.ఎ.పి. రాజు (శివ) మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న ఆహారాన్ని దృష్టిలో ఉంచుకొని ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించు కోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ చంటి ప్రిన్సిపల్ డాక్టర్ రేయినాఖాన్ డైరెక్టర్లు మధు, అశోక్ నీలిమ పాల్గొన్నారు.

15 నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి-వేపాడ

ఈ నెల 15 నుంచి నెల రోజులపాటు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి గాయత్రి తెలిపారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి టీకాల వల్ల పాల ఉత్పత్తిని తగ్గకుండా శాశ్వతంగా నివారించవచ్చని చెప్పారు. దూడల్లో మరణాలు తగ్గించి, ఆరోగ్యంగా ఎదగటానికి ఉపయోగపడుతుందని తెలిపారు.

అధ్వానంగా రహదారి

ప్రజాశక్తి-వేపాడ

మండలం లోని జగ్గయ్యపేట కోనేరు మలుపు వద్ద రోడ్డు ఛిద్రమైంది. క్వారీ లారీలు అధిక లోడులతో రాకపోకలు సాగించడం వల్ల పూర్తిగా రోడ్డు పాడైపోయింది. ఒకవైపు కోనేరు, మరోవైపు రోడ్డుపై గోతులు ఏర్పడటంతో ఏమాత్రం ఏమరపాటుగా వాహనం నడిపినా ప్రమాదం బారిన పడటం మాత్రం ఖాయం. ప్రమాదాలు సంభవించక ముందే, అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రోడ్డును బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

పాడైన రహదారి ఇదే...

షరతుల్లేకుండా వాహనమిత్ర ఇవ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎటువంటి షరతులు లేకుండానే కూటమి ప్రభుత్వం ఆటో, మ్యాక్సీ, ట్యాక్సీ, జీపు, టాటా మ్యాజిక్ డ్రైవర్లకు వాహనమిత్ర ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మార్క్స్ నగర్ (బుచ్చెన్న కోనేరు) జంక్షన్లో ఉన్న ఎఐటియుసి అనుబంధ ఆటో స్థాండ్ దగ్గర నిర్వహించిన కార్యక్రమంలో అశోక్ మాట్లాడారు. ప్రతి డ్రైవర్ కార్మికునికి పెన్షన్, పిఎఫ్, నెలకు రూ.5వేల పెన్షన్ తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్ కి వాహన మిత్ర పథకంలో ఎలాంటి షరతులు లేకుండా ఏడాదికి రూ. 25వేలు పెంచి అమలు చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈనెల 17న జిల్లాలో జరగబోవు బంద్ కార్యక్రమంలో ఆటో, మ్యాక్సీ, ట్యాక్సీ, జీపు, టాటా మ్యాజిక్ డ్రైవర్లు అంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'వాగ్దేవి'లో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-కొత్తవలస

వాగ్దేవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆంధ్రా విశ్వకళాపరిషత్ మాజీ డైరెక్టర్ కెంబూరి చంద్రమౌళి మాట్లాడుతూ యువత వ్యసనాల బారిన పడకుండా జీవితానికి అద్భుతమైన బాటలు వేసుకోవాలని కోరారు. అనంతరం ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం వాగ్దేవి విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో వాగ్దేవి విద్యాసంస్థల అధినేత కోటిన మహేశ్వరరావు, కళాశాల డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపల్ రాజకుమార్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-బొబ్బిలి

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని రావువారివీధి చెందిన ఎస్.సాయిసురేష్ విద్యుత్ సబ్ స్టేషన్లో షిఫ్ట్ ఆపరేటర్'గా పని చేస్తున్నాడు. అప్పులు ఎక్కువగా ఉండడం, తీర్చే అవకాశం లేకపోవడంతో శనివారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఆదిలక్ష్మి విద్యుత్ కార్యాలయంలో పని చేస్తున్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ చెప్పారు.

నక్క దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- సంతకవిటి

సంతకవిటి మండల కేంద్రం నుండి గరికిపాడుకు వెళ్లే మార్గం మధ్యలో శనివారం నక్క హల్ చల్ చేసింది. ఐదుగురు వ్యక్తులపై దాడి చేసింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.... సంతకవిటి మండలం అక్కరాపల్లికి చెందిన ముగ్గురు వ్యక్తులు, రేగిడి మండలం బూరాడ చెందిన ఓ వ్యక్తి, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం నిమ్మతొల్లాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై నక్క దాడి చేసింది. ఈ దాడిలో గాయపడిన ఐదుగురిని సంతకవిటి పిహెచ్‌సికి వైద్య నిమిత్తం స్థానికులు తరలించారు. ఈ మేరకు వైద్యుడు డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ ప్రథమ చికిత్స అందించారు. కొంతమంది నక్కకు పిచ్చి పట్టి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నక్క దాడితో ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

నాగావళి వంతెన పై నుంచి దూకిన మహిళ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి నాగావళి నది వంతెన పైనుంచి శనివారం సాయంత్రం గుర్తు తెలియని మహిళ దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పాలకొండ నుంచి ఓ మహిళ బ్రిడ్జిపై నడుస్తూ వస్తూ ఒక్కసారిగా బ్రిడ్జిపై నుంచి నాగావళి నదిలోకి దూకినట్లు వాహనదారులు తెలిపారు. నాగావళి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ విషయం సంకిలి, బొడ్డవలస, మంగళాపురం గ్రామాల ప్రజలకు సమాచారం వెళ్లడంతో గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు ఇంకా తెలియరావాల్సి ఉంది.

కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు

జెవివి రాష్ట్ర మహాసభలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మహిళా ప్రతినిధులు

మాజీ ఎమ్మెల్సీ పి.రఘువర్మ

జెవివి రాష్ట్ర మహాసభ చిత్రమాలిక

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్

జెవివి జిల్లా అధ్యక్షులు వెంకటరావు

జెండా విష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న జెవివి ప్రతినిధులు, నాయకులు

ఆహ్వాన సంఘం అధ్యక్షులు డివి రమణ

అమరులకు నివాళులర్పిస్తున్న జెవివి నాయకులు, మాజీ ఎమ్మెల్సీలు

మాట్లాడుతున్న గురజాడ వారసురాలు ఇందిర

జెవివి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాజేశ్వర్

యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి

తీర్మానాన్ని ఆమోదిస్తున్న ప్రతినిధులు

పల్నాడుకు చెందిన జెవివి నాయకులు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నాయకులు

గ్రూపు చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులు

యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి రచించిన సావిత్రిబాయి పూలే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నాయకులు